మురుగుమయం.. సీజనల్ భయం

- మురుగునీరు వ్యవసాయ భూమిలోకి రాకుండా అడ్డుకట్ట వేసిన రైతు
- డ్రెయినేజీలో నిలిచిన నీరు
- వీధుల్లోనూ పారుతున్న వైనం
- సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో ఆందోళన చెందుతున్న ప్రజలు



రామలక్ష్మీపురంలో డ్రెయినేజీలో నిలిచిన నీరు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురంలో మురుగునీరు డ్రెయినేజీలో నిలిచి, పలుచోట్ల వీధుల్లో పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఈ సమయంలో నీరు నిలిచి దోమలు మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉందని అంటున్నారు. అయితే గ్రామంలోని ఆలయం పక్క కింది వీధి చివర తమ వ్యవసాయ పొలాల్లోకి మురుగునీరు వస్తుందని రైతు డ్రెయినేజీ చివర అడ్డుకట్ట వేశాడు. దీంతో మురుగునీరు, వర్షాపు నీరు వీధుల్లో రోడ్డుపైనే పారుతోంది. దీంతో రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పదిహేను రోజులవుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

డ్రెయినేజీ చివరన అడ్డుకట్ట..

గ్రామంలోని ఆలయం పక్క నుంచి బీసీ కాలనీ మీదుగా ఎస్సీ కాలనీలోకి వెళ్లే దారిలో కొంతకాలం కిందట సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించారు. ఆ ప్రాంతానికి చెందిన ప్రజల ఇళ్లల్లోని మురుగు నీరంతా ఆ డ్రెయినేజీ ద్వారా దిగువకు వెళ్లేది. కానీ డ్రెయినేజీ చివర భూమి ఉన్న వ్యక్తి తన భూమిలోకి మురుగు నీరు రానీయకుండా అడ్డుకట్ట వేశాడు. దీంతో నీరు ఆ కాల్వలోనే పోటెత్తి రోడ్డుపై పారుతోంది. అయితే ఇరవై ఏళ్లుగా నీరు అటువైపే వెళ్లేది. కానీ రైతు ప్రస్తుతం అడ్డుకట్ట వేయడంతో ఆ కాలనీ ప్రజలకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే గ్రామాల్లో డెంగీ, డయేరియా, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు మంచాన పడ్డారు. ఈ సమయంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోతే దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతాయని, సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు

ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నాం



మా ఇంటి పక్కన డ్రెయినేజీలో మురుగునీరు నిలుస్తోంది. ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నాం. వీధుల్లో మురుగు నీరు నిలుస్తుండడంతో దోమల వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు నీరు నిల్వ లేకుండా చూడకపోతే మా ఇంటి వద్ద కాల్వ పూడ్చివేస్తా.

– ఎ.రాజశేఖర్‌రెడ్డి, రామలక్ష్మీపురం

ఇబ్బంది పడుతున్నాం



ప్రస్తుతం ఉన్న డ్రెయినేజీ నుంచే మురుగు నీరు అనేక ఏళ్లుగా కిందకు వెళ్తుంది. ఇప్పుడు నీరు కిందకు వెళ్లనీయకపోవడంతో మా ఇంటి ముందు నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నాం.

– పార్వతాచారి, రామలక్ష్మీపురం

అధికారులు స్పందించాలి



డ్రెయినేజీ నిండి మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో తమతో పాటు ఎస్సీ కాలనీకి వెళ్లాల్సిన ప్రజలు ఈ మురుగు నీటిలోనే నడవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఎ. అంజమ్మ, రామలక్ష్మీపురం

సమస్యను పరిష్కరిస్తాం



రామలక్ష్మీపురంలో డ్రెయినేజీ సమస్య తన దృష్టికి వచ్చింది. భూ యజమానితో మాట్లాడి నీరు కిందకు వెళ్లే విధంగా చూస్తాం. వినని పక్షంలో కాలువ చివరిలో ఇంకుడు గుంత తవ్వి నీరు నిల్వకుండా చేస్తాం.

– రామ్‌చందర్‌రావు, ఎంపీడీఓ, కోదాడ

క్లుప్తంగా

గుంత పూడ్చివేత



బేతవోలు ప్రాథమిక పాఠశాలలో ట్యాంక్ వద్ద గుంతను పూడ్చివేయించిన అధికారులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు ప్రాథమిక పాఠశాలలో మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద పైప్‌లైన్ మరమ్మతుల కోసం తీసిన గుంత ప్రమాదకరంగా ఉందని సోమవారం సాక్షిలో 'ప్రమాదకరంగా మిషన్ భగీరథ గుంత' అనే శీర్షికతో వచ్చిన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షి ధన్యవాదాలు తెలిపారు.

సేవాలాల్ సేన మీడియా కన్వీనర్‌గా నాగరాజు



నాగరాజుకు నియామకపత్రం అందజేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

పాలకవీడు : సేవాలాల్ సేన రాష్ట్ర సోషల్ మీడియా, యూత్ కన్వీనర్‌గా పాలకవీడు మండలంలోని కల్మేట్‌తండాకు చెందిన భూక్యా నాగరాజు రాథోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాలాల్ సేన రాష్ట్ర వ్యవస్థాపకులు భూక్యా సంజీవ్, సైదానాయక్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నట్లు సోమవారం విలేకరులకు తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి శ్రమిస్తానన్నారు.

రేపు సోమప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

నేరేడుచర్ల : తొలి ఏకాదశిని పురస్కరించుకొని నేరేడుచర్ల మండలంలోని సోమవరం గ్రామ పంచాయతీ పరిధిలో గల సోమేశ్వర ఆలయంలో ఈనెల 17న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చిత్తనూరు సత్యనారాయణ, వైస్ చైర్మన్ లొడంగి లక్ష్మయ్యలు సోమవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 6గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 8 గంటలకు సామూహిక అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

మునగాల : పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. మునగాల మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన వెంపటి నర్సయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.65వేల చెక్కును సోమవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నలమాద మల్సూర్, మాజీ ఎంపీటీసీ జల్లా వెంకటేశ్వర్లు, మచ్చా జానయ్య, వేణు పాల్గొన్నారు.

కూలి రేట్లు 15శాతం పెంపు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని వర్తక సంఘం కార్యాలయంలో వర్తక సంఘం, బజార్ హమాలీ సంఘం (టీఆర్‌ఎస్ కేవీ అనుబంధ సంఘం) మధ్య కూలి రేటు పెంపుపై సోమవారం చర్చలు జరిపారు. ఈ చర్చలలో కూలి రేటును 15 శాతం పెంపునకు యాజమాన్యలు అంగీకరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు అయ్యప్ప, కృష్ణారావు, రమేష్, ఆనంద్, నరసింహారావు, అనిల్, టీఆర్‌ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పి.ఉపేందర్, నాయకులు మునంగి శ్రీను, భాస్కర్, నాగరాజు, వెంకన్న, రామయ్య, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

మునగాల : వర్షాలు కురుస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లో సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ సంఘం మండల నాయకుడు చింతకాయల నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులను కోరారు. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతోనే విషజ్వరాలు ప్రబలుతున్నాయని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. విషజ్వరారాలు ప్రబలుతున్న గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

కోదాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా సుధాకర్



సంపెట సుధాకర్

కోదాడరూరల్ : కోదాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా సంపెట సుధాకర్ నియమితులైనట్లు కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొమరబండకు చెందిన సుధాకర్ 17 ఏళ్లుగా కోదాడ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మునగాల : మండలంలోని నేలమర్రి గ్రామంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో నేలమర్రి గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా బచ్చలకూరి వెంకన్న, కార్యదర్శిగా రాంపంగు వెంకన్న, ఉపాధ్యక్షుడిగా బచ్చలకూరి రాజేష్, సహాయ కార్యదర్శిగా ఏసోబు నవీన్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా గోవర్ధన్, గౌరవ సలహాదారుడిగా షేక్ సైదాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంటా వెంకన్న, సీఐటీయూ మండల సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, మామిడి నాగేంద్రబాబు, నాగరాజు, ఆంజనేయులు, బాషా, సైదులు, నాగేంద్రబాబు, సంజీవ, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ కమిటీ ఎన్నిక

మఠంపల్లి : మఠంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో గల రామాలయ కమిటీ సమావేశాన్ని సోమవారం యాదాద్రి జిల్లాలోని సప్తగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రామాలయ నూతన అధ్యక్షుడిగా కామళ్ల రాంబాబు, ఉపాధ్యక్షుడిగా మీసాల సందీప్, ప్రధాన కార్యదర్శిగా కామళ్ల గోపాలకృష్ణ, కార్యదర్శిగా మామిడి సాయిలు, కోశాధికారులుగా ఎస్.మట్టయ్య, ఎం.నాగరాజు, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఏసుమళ్ల గోపయ్య, జోజి, తదితరులు ఉన్నారు.

ఆటో యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా చందమళ్ల వెంకన్న



సన్మానం పొందిన నూతన కమిటీ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల ఆటో యూనియన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చందమళ్ల వెంకన్న, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె మౌలానా, కోశాధికారిగా బానోతు నాగులు, కార్యదర్శిగా సైదులు, సహాయ కార్యదర్శిగా వెంకటరమణ, కార్యవర్గ సభ్యులుగా బెజ్జం నగేష్, గౌరవ సలహాదారులుగా రాములు, హుస్సేన్, కాశీ, నాగుల్ మీరాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ సభ్యులు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు.

నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి



విలేకరులతో మాట్లాడుతున్న మలిదశ ఉద్యమకారులు

గరిడేపల్లి : నిరుద్యోగుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని మలిదశ ఉద్యమకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలిదశ ఉద్యమకారులు మండవ నాగేశ్వర్‌రావుగౌడ్, పిడమర్తి అంజి, జుట్టుకొండ మధు, అమరగాని లక్ష్మణ్, చింతమల లవకుమార్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నా నేటికీ వేయలేదని ఆరోపించారు. ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పడంతో పాటు నిరుద్యోగ యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి హామీలను తుంగలో తొక్కాడని అన్నారు. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని అన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న జానకిరెడ్డి దంపతులు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పరిధిలో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుల జానకిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా జానకిరెడ్డి యువసేన ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జానకిరెడ్డి దంపతులు, జానకిరెడ్డి యువసేన సభ్యులు గురుపాకుల సతీష్, మానుపాటి నాగరాజు, సిరికొండ నవీన్, సిరికొండ రామకృష్ణ, పగిళ్ల రవి, రాకేష్, సతీష్, గోవర్ధన్, గోపి, రాంబాబు, రంజిత్, నవీన్, ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి విజయమ్మ, సిబ్బంది జ్యోతి పాల్గొన్నారు.

సీపీఐ సమావేశాన్ని జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : పట్టణంలోని మార్కెట్ యార్డులో ఈనెల 28న నిర్వహించబోయే సీపీఐ ఉమ్మడి నేరేడుచర్ల మండల విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు. సోమవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ హాజరవుతున్నారని తెలిపారు.

బీసీ సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్



అరెస్టయిన బీసీ సంఘం నాయకులు

నేరేడుచర్ల : బీసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్లకుండా సోమవారం బీసీ సంఘం నాయకులను నేరేడుచర్ల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీసీ సంఘం నాయకులు బోడ్డుపల్లి సుందరయ్య, గుర్రం మార్కెండేయ ఉన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాదు

సూర్యాపేట : చదువుకు పేదరికం అడ్డు కాదని హెడ్ కానిస్టేబుల్, హైకోర్టు లైజన్ ఆఫీసర్ పాలవెల్లి రమేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో పేద విద్యార్థులకు బ్యాగ్‌లు, బూట్లు, పెన్నులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక నెల జీతం పేద విద్యార్థుల చదువుకు ఖర్చు పెడతానని తెలిపారు. ఆలేటి ఆటం పిల్లలకు, అపూర్వ బధిరుల పాఠశాల పిల్లలకు మొత్తం 53మందికి సుమారు రూ.70వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం గోలి పద్మ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

హుజూర్‌నగర్ : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. సీఐటీయూ పిలుపులో భాగంగా సోమవారం హుజూర్‌నగర్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పీఆర్‌ఓ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 10ని రద్దు చేయాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.సైదులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఉత్తమ్ పీఆర్‌ఓ వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం



తాడువాయిలో వైద్యశిబిరంలో జ్వరపీడితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం



నడిగూడెం : తెల్లబెల్లిలో రోడ్డు వెంట నిలిచిన నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం



లక్కవరంలో జ్వరంతో బాధపడుతున్న మహిళను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

మునగాల : ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యారోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.కోటాచలం కోరారు. మునగాల మండలంలోని తాడువాయిని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పల్లెదవాఖానాలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న పలు వీధులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆ తర్వాత స్థానిక గోపాల మిత్ర భవనంలో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి డా.నాజియా, జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య, ఎపిడమాలజిస్ట్ సతీష్, ఎంపీడీఓ రమేష్ దీనదయాళ్, రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీశైలం, వినయ్‌కుమార్, పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, సబ్ యూనిట్ అధికారి ఎం.సుదర్శన్, మాజీ వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి అబ్బగాని సతీష్, రేపాల పీహెచ్‌సీ సిబ్బంది లింగం రామకృష్ణ, శారద, శ్రీనివాస్, లింగయ్య, ఏఎన్‌ఎంలు సుచరిత, మమత, ఆశావర్కర్లు మయూరి, మార్తమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

తాడువాయిలో విషజ్వరాల బారిన పడి వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఎన్.పద్మావతి సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలంను ఫోన్‌లో మాట్లాడి కోరారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంతవరకు వైద్యశిబిరాన్ని కొనసాగించాలని కోరారు.

తాడువాయిలో కొనసాగుతున్న వైద్యశిబిరం..

తాడువాయిలో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో మూడవ రోజు సోమవారం 61 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రీశైలం తెలిపారు. వీరిలో 8 మంది జ్వరం బారిన పడినట్లు గుర్తించామని, ప్రస్తుతం 19 మంది జ్వరంతో బాధపడుతున్నారని, 26 మందికి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు. గ్రామంలో వైద్యశిబిరాన్ని విషజ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు కొనసాగిస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి ప్రజలు విష జ్వరాల బారిన పడుతుండడంపై సాక్షి దినపత్రికలో సోమవారం 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం గ్రామంలో జిల్లా మాస్ మీడియా అధికారి (డిప్యూటీ డెమో) అంజయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాబుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విష జ్వరాల బారిన పడిన బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరం నిర్వహించి జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించాలని వైద్య సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట ఎపిడమాలజిస్టు సతీష్, మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత, సూపర్‌వైజర్లు పద్మ, అంజయ్య, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, శ్రీనివాస్, సిబ్బంది వరలక్ష్మి, సావిత్రి, వెంకన్న, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తెల్లబల్లిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

నడిగూడెం : మండలంలోని తెల్లబెల్లిలో విషజ్వరాలు ప్రబలుతున్నాయన్న సమాచారంతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను పరిశీలించారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వైద్యసేవలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామానికి చెందిన జ్వరపీడితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రిపురవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.లక్ష్మీ ప్రసన్న, పల్లెదవాఖానా వైద్యాధికారులు డాక్టర్లు హరినాథ్, ప్రసన్న, ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, సిబ్బంది అంజయ్య, ఆకుల సతీష్, కళావతి, విజయ్‌కుమార్, కృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, విజయ, మంజుల, కృష్ణమూర్తి, మంగ, గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేధోవికాసానికి పూర్వ ప్రాథమిక విద్య



హుజూర్‌నగర్ : ర్యాలీలో పాల్గొన్న హెచ్‌ఎంలు, టీచర్లు, చిన్నారులు



మఠంపల్లి : లాలీతండాలో అమ్మమాట- బడిబాట నిర్వహిస్తున్న కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్

హుజూర్‌నగర్ : చిన్నారుల మేధో వికాసానికి పూర్వ ప్రాథమిక విద్య ఉపకరిస్తుందని హుజూర్‌నగర్ పట్టణంలోని యూపీఎస్, మల్లన్ననగర్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటరెడ్డి, రామతారక అన్నారు. సోమవారం పట్టణంలోని 1, 2, 3, 4, 5, 7, 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు, స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండున్నర ఏళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

'అమ్మమాట– అంగన్‌వాడీ బడిబాట'

మఠంపల్లి : మండలంలోని లాలితండా, క్రిష్ణతండా, కామంచికుంటతండా, రామచంద్రాపురం తండాల్లో కిషోర బాలలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ సోమవారం గల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ఉమ, భవాని, సరిత, రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

